# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-02-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు ఈరోజు ఎన్నికలు జరుగుతున్నాయి.**
3. **కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర బడ్జెట్ దోహదపడుతుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.**
4. **రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పరిశ్రమలశాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు.**
5. **ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అంశాలపై కేంద్రహోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల అధికారులు ఈరోజు సమావేశమయ్యారు.**

==========================

వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఈ రోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, భారత్ అభివృద్ధిని ప్రపంచదేశాలు గమనిస్తున్నాయని అన్నారు. కృత్రిమ మేధ-ఏఐ సాంకేతికతలో భారత్ ముందుందని చెప్పారు. సమ్మిళిత వృద్ధితోనే అభివృద్ధి సాధ్యమని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలుస్తుందని ముఖ్యమంత్రి తెలుపుతూ...

వాయిస్...32 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు ఈరోజు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మేరకు తిరుపతి, నెల్లూరు, ఏలూరు నగరపాలక సంస్థలకు డిప్యూటీ మేయర్లతో పాటు నందిగామ, హిందూపురం, పాలకొండ మునిసిపాలిటీల చైర్‌పర్సన్‌ల కోసం ఎన్నికలు జరుగుతున్నాయి. అలాగే నూజివీడు, తుని, పిడుగురాళ్ల పురపాలక సంఘాలకు వైస్ చైర్ పర్సన్స్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా టిడిపి మద్దతు తెలిపిన సయ్యద్

తహసిన్ ఎన్నికయ్యారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ వైస్ చైర్మన్‌గా టిడిపి అభ్యర్థి శివకుమార్ రెడ్డి ఎన్నికైనట్లుగా అధికారులు ప్రకటించారు. మరోవైపు హిందూపురం మున్సిపాలిటీ ఛైర్మన్‌గా టిడిపి అభ్యర్థి రమేశ్ ఎన్నికయ్యారు. దీనిపై మరింత సమాచారాన్ని సత్య సాయి జిల్లా మా ఆకాశవాణి ప్రతినిధి ఎం.మనోహర్ అందిస్తారు.

వాయిస్ .. 24 సెకన్లు

---------------------------

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర బడ్జెట్ దోహదపడుతుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బడ్జెట్‌లో పోలవరం, విశాఖ ఉక్కు సంస్థకు ప్రాధాన్యమివ్వడం శుభపరిణామమని ఒక ప్రకటనలో వెల్లడించారు. తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం.. పోలవరానికి 5 వేల 936 కోట్లు, విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి 11 వేల 197 కోట్ల రూపాయలను కేటాయించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు ప్రతిబింబించేలా ఈ ప్రతిపాదనలున్నాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పరిశ్రమలశాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. కర్నూలులో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు వివరాలను ఆయన నిన్న పాత్రికేయులకు వివరించారు. దావోస్ సదస్సులో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని రాష్ట్ర బృందం ఐదు రోజుల వ్యవధిలో వందకు పైగా సమావేశాల్లో పాల్గొన్నదని తెలిపారు.

---------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అంశాలపై కేంద్రహోంశాఖ కార్యాలయంలో ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఇతర అధికారులు హాజరయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న ప్రధానాంశాలపై అధికారులు చర్చిస్తున్నారు. విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులపైనా ఈ సమావేశంలో చర్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళావైభవంగా కొనసాగుతోంది. వసంతపంచమి సందర్భంగా ఈరోజు తెల్లవారుజాము నుంచే త్రివేణీ సంగమంలో భక్తులు మూడవ అమృత స్నానాలను ఆచరిస్తున్నారు. దీంతో త్రివేణి సంగమం భక్తులతో కిటకిటలాడుతోంది. కాగా మొదటి రెండు అమృత స్నానాలు జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి రోజున, జనవరి 29వ తేదీ మౌని అమావాస్యనాడు జరిగాయి. కుంభమేళా ప్రాంతాల్లో రద్దీ దృష్ట్యా పారా మిలిటరీ బలగాలతో సహా 50 వేల మంది పోలీస్ బలగాలతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లను చేసింది.

---------------------------

తిరుమలలో రేపు జరగనున్న రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తుల కోసం ఉద్యోగులు, సిబ్బంది ప్రణాళిక బద్ధంగా సేవలు అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె శ్యామలరావు సూచించారు. రథసప్తమికి వచ్చే భక్తులకు అందించే సేవలపై తిరుమల ఆస్థాన మండపంలో ఆయన నిన్న సమీక్ష సమావేశం

నిర్వహించారు.  ఈ సందర్భంగా మాట్లాడుతూ,

వాయిస్ ...25 సెకన్లు

ఇది ఇలా ఉండగా తిరుమలలో  రేపు రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశాలు ఉండటంతో తిరుపతిలోని మూడు కేంద్రాల్లో సాధారణ భక్తులకు ప్రతి రోజూ ఇచ్చే దివ్యదర్శనం–ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టిటిడి ప్రకటించింది. ఈరోజు, రేపు, ఎల్లుండికి సంబంధించిన టోకెన్ల జారీని నిలిపివేసినట్లు వెల్లడించింది.

-------------------------

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ప్రభుత్వ ఆసుపత్రిలో  నూతనంగా ఏర్పాటు కానున్న డయాలసిస్ కేంద్రం త్వరలో  ప్రారంభమవుతుందని  జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు  తెలిపారు .పాలకొల్లులో డయాలసిస్ కేంద్రం నిర్మాణ పనులను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రానికి సంబంధించి 90 శాతం పనులు జరిగాయని, మరో మూడు రోజుల్లో మిగిలిన 10 శాతం పనులు పూర్తి అవుతాయని తెలిపారు. తద్వారా భీమవరం, ఏలూరు, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, అమలాపురం ప్రాంతాలలోని డయాలసిస్ బాధితులకు ఈ డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

-------------------------

సున్నా శాతం కర్బన ఉద్గారాలతో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ రైల్వేగా తీర్చిదిద్దాలనే  లక్ష్యంతో  భారతీయ రైల్వే పనిచేస్తుందని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఆనంద్ రావు పాటిల్ తెలిపారు. రైల్వేలో విద్యుదీకరణ మొదలై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విజయవాడలో నిర్వహించిన వాక్ థాన్‌ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఎం. పాత్రికేయులతో మాట్లాడుతూ, విజయవాడ డివిజన్‌లో నూరుశాతం విద్యుదీకరణతో రైళ్లు నడుస్తున్నాయన్నారు. వందశాతం గ్రీన్ రైల్ నెట్ వర్క్ లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొంటూ,

వాయిస్...27 సెకన్లు

-------------------------

తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రేపు ఉద్యోగ మేళాను  నిర్వహించనున్నట్లు  జిల్లా ఉపాధి శాఖ అధికారి లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సూళ్లూరుపేటలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మేళా జరుగుతుందని చెప్పారు.  10వ తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో  18 నుంచి 32 ఏళ్ల వయసు గల యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు.

=====================